క్లుప్తంగా

వీల్‌చైర్ వితరణ



దివ్యాంగునికి వీల్‌చైర్ అందజేస్తున్న మేమున్నాం సంస్థ ప్రతినిధులు

విజయనగరం టౌన్: నిరుపేద దివ్యాంగునికి మేమున్నాం స్వచ్ఛంద సంస్థ సభ్యులు ఆదివారం వీల్‌చైర్ వితరణగా అందజేశారు. బీసీ కాలనీకి చెందిన బాబూరావుకి కొన్నేళ్లుగా కాళ్లు పని చేయకపోవడంతో అతనికి దాత ఎన్‌వీవీఎన్‌కే ప్రసాద్ సహకారంతో రూ.9 వేల విలువైన వీల్‌చైర్ అందజేసినట్లు సంస్థ వ్యవస్థాపకుడు కేఎస్‌ఎన్ మూర్తి తెలిపారు. కార్యక్రమంలో ఆల్తి సూరిబాబు, డోకి చంద్రశేఖర్, జయ, భవానీ, లత, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

డెంకాడ: సబ్‌స్టేషన్, విద్యుత్ లైన్ల నిర్వహణ కార్యక్రమాల్లో భాగంగా మండలంలోని డెంకాడ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు సోమవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జి.సురేష్‌బాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని డెంకాడ, గుణుపూరు, గుణుపూరుపేట, ముంగినాపల్లి, డి.కొల్లాం, చొల్లంగిపేట, డీఆర్ పాలెం, నగరప్పేట, పోతయ్యపాలెం, పెదతాడివాడ, పినతాడివాడ, గొడిపాలెం, వెదుళ్లవలస, దొడ్డిబాడువ, చందకపేట, మహంతిపేట, లెంకపేట, సింగవరం, నాతవలస గ్రామాలకు సరఫరా ఉండదని.. వినియోగదారులు సహకరించాలని కోరారు.

రక్తదానం



రక్తదానం చేస్తున్న సాధన యువజన సంఘ సభ్యుడు

నెల్లిమర్ల: సాధన యువజన సంఘ సభ్యులు ఆదివారం రక్తదానం చేశారు. విజయనగరం సర్వజన ఆస్పత్రి బ్లడ్‌బ్యాంక్‌లో సేవా పక్వాడా కార్యక్రమంలో భాగంగా మేము సైతం అంటూ జరజాపుపేటకు చెందిన సాధన యువజన సంఘం సభ్యులు రక్తదానం చేసి పలువురికి ఆదర్శంగా నిలిచారు. దేశ ప్రధాని పుట్టిన రోజు సందర్భంగా సామాజిక చైతన్యంతో సాధన యువజన సంఘ సభ్యులు రక్తదానం చేయడంపై పలువురు అభినందించారు. ఈ సందర్భంగా సాధన అధ్యక్షుడు పి.దుర్గాప్రసాద్ మాట్లాడుతూ, ప్రతిఒక్కరూ రక్తదానం వైపు మొగ్గు చూపాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పూర్ణ, రామకృష్ణ, కె. శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ అనుసంధానం చేసుకోండి

బొండపల్లి: విద్యుత్ మీటర్లు ఉన్న ప్రతి ఒక్కరూ విధిగా తమ విద్యుత్ సర్వీసు నంబర్‌కు ఆధార్‌ను అనుసంధానం చేసుకోవాలని విద్యుత్ శాఖ ఏఈఈ ఆర్.శంకరరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలం వ్యాప్తంగా 15 వేల వరకు గృహ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయని, ఇంత వరకు సుమారు 10వేల మంది తమ సర్వీసు నంబర్‌కు ఆధార్ అనుసంధానం చేసుకున్నారని తెలిపారు. మిగిలిన వారు త్వరగా అనుసంధానం చేసుకోవాలని సూచించారు. విద్యుత్ శాఖకు సంబంధించిన యాప్‌లో కానీ, సచివాలయ జేఎల్‌ఎంల వద్ద కానీ అనుసంధానం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఫార్మసీ రంగంలో అపార అవకాశాలు

మెంటాడ(గజపతినగరం రూరల్): భవిష్యత్ అంతా ఫార్మసీ రంగానిదేనని, ఫార్మసీ కోర్సులు చేసిన వారికి అపారమైన ఉపాధి అవకాశాలున్నాయని ఆంధ్రా యూనివర్సిటీ ఫార్మసీ కళాశాల ప్రొఫెసర్ కె.ఈశ్వరప్రసాద్ అన్నారు. గజపతినగరం మండలంలోని సీతారామపురం గ్రామంలోని శ్రీసాయి ఫార్మసీ కళాశాల వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. అతిథిగా హాజరైన ప్రొఫెసర్ ఈశ్వరప్రసాద్ మాట్లాడుతూ ప్రస్తుతం అత్యంత వేగంగా ఉపాధి అవకాశాలు కల్పిస్తున్న రంగం ఏదైనా ఉందంటే అది ఫార్మసీ రంగమేనని అన్నారు. వార్షికోత్సవంలో భాగంగా విద్యార్థులకు వివిధ ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ కె.లక్ష్మీదీప్తి, అధ్యాపకులు కె.వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి పంచామృతాభిషేకం



చీపురుపల్లి: స్థానిక కనకమహాలక్ష్మి ఆలయంలో అమ్మవారికి అర్చకులు ఆదివారం పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అమ్మవారికి ప్రతీ ఆదివారం అభిషేకాలతో పాటు ప్రత్యేక పూజలు, అలంకరణ నిర్వహిస్తూ వస్తున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ ఇప్పిలి గోవింద, వైస్ చైర్మన్ నూరు కుమార్‌ల ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

శరవేగంగా రోడ్డు విస్తరణ పనులు

- అంబేడ్కర్ జంక్షన్ – మయూరి జంక్షన్ వరకు విస్తరణ
- పైడితల్లి పండగ సందర్భంగా చకా చకా పనులు
- మరోవైపు పెద్ద చెరువు గట్టు సుందరీకరణ

విజయనగరం: మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రధాన రహదారుల విస్తరణ పనులు జోరందుకున్నాయి. నగరంలో నిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉండే మయూరి జంక్షన్ నుంచి అంబేడ్కర్ జంక్షన్ వరకు ప్రస్తుతమున్న నాలుగు లేన్ల రహదారిని ఆరు లేన్లుగా విస్తరించే పనులు జోరుగా జరుగుతున్నాయి. 1.2 కిలోమీటర్ల పొడవుగల ఈ మార్గంలో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రస్తుతం 80 అడుగుల వెడల్పుతో ఉన్న నాలుగు లేన్ల రోడ్డును వంద నుంచి 120 అడుగుల వెడల్పుతో ఆరు లేన్లగా విస్తరించనున్నారు. వాస్తవానికి ఈ పనులు గత ప్రభుత్వ హయాంలో 2017లో ప్రారంభించినప్పటికీ అప్పట్లో పాలకులు చేయలేక చెతులెత్తేశారు. ఆర్‌అండ్‌బీ ఆధ్వర్యంలో రూ.4.22 కోట్లతో అప్పట్లో ప్రారంభించిన పనులు భవనాల తొలగింపు, కొంత మార్గంలో కాలువ నిర్మాణంతో ఆగిపోయింది. పనులు సకాలంలో పూర్తికాకపోవడంతో కేటాయించిన నిధులు సైతం వెనక్కి మళ్లిపోయాయి. దీంతో ఈ మార్గం గుండా రాకపోకలు సాగించే వారికి ఇబ్బందులు తప్పలేదు. 2019 ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజల కష్టాలను గుర్తించి ప్రధాన రహదారుల విస్తరణ పనులపై దృష్టి సారించింది. వెనక్కి మళ్లిపోయిన నిధులు మరలా కేటాయించేలా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ప్రభుత్వ పెద్దలు, ఉన్నతాధికారులతో మాట్లాడి ఒప్పించారు. దీంతో నిధులు మళ్లీ మంజూరు కావడంతో ప్రస్తుతం పనులు జోరందుకున్నాయి.



విజయనగరం ఆర్టీసీ కాంప్లెక్స్ జంక్షన్ నుంచి మయూరి జంక్షన్ వరకు పూర్తయిన డివైడర్ నిర్మాణ పనులు



ట్యాంక్‌బండ్ రోడ్డులో పెద్ద చెరువు గట్టును పటిష్టం చేస్తున్న దృశ్యం

ఇప్పటికే 600 మీటర్ల మేర కాలువ నిర్మాణం పూర్తి చేయగా... పైన ఉన్న పెద్ద చెరువు నుంచి దిగువ భాగంలోని ఖాళీ ప్రదేశంలోకి నీరు ప్రవహించేందుకు అవసరమైన నిర్మాణ పనులు పూర్తి చేశారు. అనంతరం ఆ మార్గం వెంబడి ఉన్న సెంట్రల్ లైటింగ్ స్తంభాలను తొలగించారు. ఆ మార్గంలో ప్రస్తుతం డివైడర్ నిర్మాణ పనులు జోరుగా సాగుతున్నాయి. మొత్తం రూ.7 కోట్లతో ఈ పనులు చేపడుతుండగా... మయూరి జంక్షన్ నుంచి ఎల్‌ఐసీ కార్యాలయం వరకు ఒక భాగంగా... అక్కడి నుంచి బాలాజీ జంక్షన్ వరకు మరో భాగంగా విస్తరణ పనులు చేపట్టనున్నారు. ఈ పనులను అక్టోబర్‌లోగా పూర్తి చేయనున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఇదిలా ఉండగా మరో వైపు అంబేడ్కర్ జంక్షన్ నుంచి మయూరి జంక్షన్ వరకు వెళ్లే మార్గంలో పెద్ద చెరువు గట్టు సుందరీకరణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. గట్టుకు, రోడ్డుకు అనుసంధానంగా రెండు చోట్ల విద్యుత్ దీపాలంకరణలతో ఫౌంటైన్లను ఏర్పాటు చేస్తున్నారు.

పనులు వేగవంతం..

జిల్లా కేంద్రంలోని మయూరి జంక్షన్ నుంచి అంబేడ్కర్ జంక్షన్ వరకు చేపడుతున్న రహదారి విస్తరణ పనులు వేగవంతం చేశాం. మొత్తం రూ.7 కోట్లతో ఈ పనులు చేపడుతున్నాం. గత ప్రభుత్వ హయాంలో ప్రారంభించి మధ్యలో పనులు నిలిపివేయడంతో నిధులు వెనక్కి వెళ్లిపోయాయి. మరలా ఈ ప్రభుత్వ హయాంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి నిధులు మంజూరు చేయించడంతో పనులు ప్రారంభించాం. అక్టోబర్‌లోగా పనులు పూర్తి చేసేలా కార్యాచరణ సిద్ధం చేశాం.

–టి.శ్రీనివాసరావు,
డీఈఈ, ఆర్‌అండ్‌బీ, విజయనగరం

కొరటాల స్ఫూర్తితో ఉద్యమిద్దాం..

- సీపీఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ

విజయనగరం పూల్‌బాగ్: కొరటాల సత్యనారాయణ స్ఫూర్తితో పేద, బడుగు, బలహీనవర్గాల హక్కులు, పేదల రాజ్యం కోసం ఉద్యమించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక ఎల్‌బీజీ భవనంలో కొరటాల సత్యనారాయణ శత జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సత్యనారాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు రెడ్డి శంకరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తమ్మినేని మాట్లాడుతూ.. మేధావిగా పేరుగాంచిన సత్యనారాయణ సంపన్న కుటుంబంలో జన్మించినప్పటికీ, పేదల విముక్తి కోసం సీపీఎంలో పని చేయడం గొప్ప విషయమన్నారు. సీపీఎం అభ్యున్నతికి ఎనలేని కృషి చేయడంతో పాటు దోపిడీదారుల పాలనకు వ్యతిరేకంగా అనేక ఉద్యమాలు నడిపి స్ఫూర్తిగా నిలిచారని కొనియాడారు. ప్రజాశక్తి పత్రిక అభివృద్ధిలో ఆయన కృషి ఎనలేనిదన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ఏర్పాటు కోసం ఎమ్మెల్యే పదవికి సైతం రాజీనామా చేసిన ధీశాలని కొనియాడారు. ఆయన మొత్తం ఆస్తిని పార్టీకి అంకితం చేశారని తెలిపారు. ఆయన ఆశయాలను కొనసాగించడానికి యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు వి.లక్ష్మి, పి.రమణమ్మ, కె.సురేష్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కొరటాల చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలి..

- నేషనల్ దోబీ మహా సంఘు జిల్లా కమిటీ డిమాండ్

విజయనగరం అర్బన్: రాష్ట్రంలో ఉన్న రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని నేషనల్ దోబీ మహా సంఘ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు సంఘ కమిటీ సభ్యులు ఆదివారం స్థానిక కలెక్టరేట్ వద్ద ఉన్న పూలే విగ్రహం ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, దేశంలో దాదాపు అన్ని రాష్ట్రాలలోనూ రజకులు ఎస్సీలుగా చలామణి అవుతున్నారని తెలిపారు. ఒకే వృత్తి చేస్తున్న రజకులందరూ ఒకే రిజర్వేషన్ పొందాలని, ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తమను ఎస్సీల్లో చేర్చాలని కోరారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు గుగ్గిలాపు రమణ, కెల్ల సత్యం, పొట్నూరు శ్రీను, జి.ఆదినారాయణ, తామాడ సీత, బీమసింగి రమణ, సీహెచ్ అప్పలస్వామి, బి.కాళిదాసు, బి.బంగారయ్య, సీహెచ్ ఉష, గురుమూర్తి, సావిత్రి, రామారావు, కుమిలి రామారావు, తదితరులు పాల్గొన్నారు.



పూలే విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న రజక సంఘ ప్రతినిధులు

రూ.90 లక్షలతో రోడ్డు పునరుద్ధరణ

దత్తిరాజేరు: మండలంలోని పెదకాద గ్రామం నుంచి మరుపల్లి వద్ద జాతీయ రహదారి వరకు ఏఎంసీ నిధులు రూ.90 లక్షలతో తారురోడ్డు పునరుద్ధరణ పనులు చేపడుతున్నామని ప్రాజెక్ట్ డీఈ అప్పలనాయుడు ఆదివారం తెలిపారు. రోడ్డు గోతులు తేలి అధ్వానంగా తయారు కావడంతో సమస్యను ఎంపీటీసీ సత్యం,ఉప సర్పంచ్ సామిరెడ్డి ఈశ్వరరావు ఎమ్మెల్యే బొత్స అప్పలనరయ్య దృష్టికి తీసుకువెళ్లారు. రోడ్డును పునరుద్ధరించాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. అధికారులు అంచనాలు తయారు చేసి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించడంతో నిధులు మంజూరయ్యాయి. 3.5 కిలోమీటర్ల మేర రోడ్డు చిప్స్, బెర్మల పనులు పూర్తయ్యాయని, వారం రోజుల్లో తారుపూత పనులను పూర్తి చేస్తామని డీఈ తెలిపారు.



పెదకాదకు వేస్తున్న తారురోడ్డు

పేదలకు చేయూతనివ్వడంలోనే సంతృప్తి

విజయనగరం ఫోర్ట్: పేదలకు చేయూతనివ్వడంలో సంతృప్తి ఉంటుందని మారుతీ స్వయం సహాయక సంఘ అధ్యక్షుడు గుత్తురు చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం స్థానిక కణపాక అగురవీధిలో వంద మంది పేదలకు బియ్యం, గోధమనూక, నూనె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వృద్ధాప్యంలో తల్లిదండ్రులను ప్రేమగా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో చలుమూరి రామ్మోహన్, నాగరాజు, అప్పలస్వామి, తులసీరామ్, తదితరులు పాల్గొన్నారు.



పేదలకు బియ్యం పంపిణీ చేస్తున్న మారుతీ సంఘ ప్రతినిధులు

ప్రజల్లోకి ప్రభుత్వ పథకాలు..

- ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

నెల్లిమర్ల: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు అధికారులు కృషి చేయాలని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. నెల్లిమర్ల మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ అంబళ్ల సుధారాణి అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, స్వాతంత్ర్యం వచ్చిన ఇన్నేళ్లలో ఎన్నడూ లేనంతంగా ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు అధికారులు చిత్తశుద్ధితో కృషి చేయాలని సూచించారు. విద్యకు సంబంధించి అనేక మహత్తర కార్యక్రమాలు చేపడుతుంటే ఉపాధ్యాయులు వారి డిమాండ్ల సాధన కోసం విధుల నిర్వహణలో అలసత్వం వహించడం సరికాదన్నారు. దీనివల్ల విద్యార్థుల భవిష్యత్‌కు భంగం వాటిల్లే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులు మండలంలో ఈనెల 30వ తేదీ నుంచి ప్రారంభిస్తున్నట్లు కొండవెలగాడ, సతివాడ పీహెచ్‌సీ వైద్యాధికారులు తెలిపారు. ప్రస్తుతం మండల వ్యాప్తంగా ఆరోగ్య సురక్ష సర్వే చేపడుతున్నామన్నారు. శిబిరాల్లో ఏడు రకాల పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి 105 రకాల మందులు అందజేస్తామని చెప్పారు. పశువైద్యం నిమిత్తం ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చిన 1962 అంబులెన్స్ కోసం మండల పరిషత్ పరిషత్ ప్రాంగణంలో ఒక షెడ్డు నిర్మించాలని ఎమ్మెల్యే బడ్డుకొండ ఎంపీపీకి సూచించారు. మండల వ్యాప్తంగా రైతులకు అవసరమైన వరి విత్తనాలను పూర్తి స్థాయిలో అందజేశామని, ఎరువులు కూడా సిద్ధం చేశామని వ్యవసాయాధికారులు సభ దృష్టికి తీసుకువచ్చారు. మండలంలోని 44 గ్రామాలకు జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారా ఇంటింటికీ కుళాయిలు మంజూరయ్యాయని గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులు తెలిపారు. హౌసింగ్‌కు సంబంధించి చర్చ జరిగినప్పుడు పెండింగ్ బిల్లులను సోమవారం నుంచి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తామని ఆ శాఖాధికారులు చెప్పారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు, వైస్ ఎంపీపీలు సారిక వైకుంఠం, పతివాడ సత్యనారాయణ, ఎంపీడీఓ జి. రామారావు, తహసీల్దార్ డి. ధర్మరాజు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, పక్కన ఎంపీపీ సుధారాణి, తదితరులు

ఈ పంట నమోదుతో బహుళ ప్రయోజనాలు

- మండలంలో జోరుగా పంటల వివరాల నమోదు

ఎన్నో ప్రయోజనాలు..



ఈ క్రాప్‌లో సాగు చేసిన పంటల వివరాలను నమోదు చేసుకోవడం ద్వారా అన్నదాతలు ఎన్నో ప్రయోజనాలు పొందే అవకాశం ఉంటుంది. ఖరీఫ్ పంటలను సాగు చేస్తున్న రైతులకు ఈ క్రాప్ తప్పనిసరి. దళారుల చేతుల్లో మోసపోకుండా ప్రభుత్వ మద్దతు ధర పొందాలంటే పంట నమోదు చేసుకోవాలి. రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

–వి హరికృష్ణ,
మండల వ్యవసాయాధికారి, భోగాపురం

భోగాపురం: ఖరీఫ్ సాగు చేసే ప్రతి రైతూ ఈ పంటలో (క్రాప్) వివరాలు నమోదు చేసుకోవాలని, అప్పుడే ప్రభుత్వం నుంచి పలు ప్రయోజనాలు అందుతాయని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. పండించిన పంటలను దళారుల నుంచి కాపాడుకుని ప్రభుత్వ కనీస మద్దతు ధర పొందాలంటే పంట నమోదు కీలకం. ప్రభుత్వం ఎంతో చిత్తశుద్ధితో అమలుచేస్తున్న ఈ క్రాప్ బుకింగ్ నమోదును రైతులు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరుతున్నారు. మండల పరిధిలో పంట పొలాలు మొత్తం ఆరువేల ఎకరాలు ఉండగా, ఇప్పటివరకు 5,500 ఎకరాల వివరాలు నమోదయ్యాయి. మొత్తం 3,500 మంది రైతులకు గాను ఇప్పటివరకు 2,200 మంది రైతులు పంట నమోదు చేసుకున్నారు. మండలంలో 11 రైతుభరోసా కేంద్రాలు, అగ్రికల్చర్ ఫీల్డ్ అసిస్టెంట్ల ద్వారా పంట నమోదు జోరుగా సాగుతోంది. మండల పరిధిలో ప్రధాన పంట వరి కాగా.. వేరుశనగ, కూరగాయాలు, తదితర పంటలు కూడా సాగు చేస్తున్నారు.అగ్రికల్చర్, హార్టికల్చర్ అధికారులు క్షేత్రస్థాయికి వచ్చి ఏ సర్వే నంబర్లో ఏ రైతు, ఏ పంట, ఎంత విస్తీర్ణంలో సాగు చేశారన్న విషయాలను నమోదు చేస్తున్నారు. పంట సాగు చేసిన రైతును పొలం వద్దే ఫొటో తీసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తారు. ఇలా పూర్తి వివరాలతో ఈ క్రాప్ నమోదు చేసుకున్న రైతులకు మాత్రమే రైతుభరోసా, పంట బీమా, మద్దతు ధర, పంట దెబ్బతింటే తక్షణం పరిహారం వంటి ప్రభుత్వం అందిస్తున్న ప్రయోజనాలు అందుతాయి.



భోగాపురంలో ఈ-పంట నమోదు చేస్తున్న అగ్రికల్చర్ అసిస్టెంట్

సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలి

చీపురుపల్లి: విద్యార్థులు, యువత సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని ప్రభుత్వ బాలికల కళాశాల వసతిగృహ సంక్షేమాధి కారి యశోధ అన్నారు.

జాతీయ సేవా పథకం దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాల ఆవరణలోని బాలికల కళాశాల హాస్టల్ విద్యార్థినులకు జాతీయ సేవా పథకంపై ఆశయ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం అవగాహన నిర్వహించారు. అతిథిగా హాజరైన సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుడు డోల నాగరాజు మాట్లాడుతూ విద్యార్థులు కళాశాలల్లో చదువుకుంటున్నప్పుడే సేవా కార్యక్రమాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. అలాగే పుస్తకపఠనం అలవాటు చేసుకోవాలని సూచించారు. అనంతరం ఆశయ సంస్థ సమకూర్చిన నీతి కథల పుస్తకాలను విద్యార్థినులకు అందజేశారు. ఆశయ సంస్థ అధ్యక్షుడు రెడ్డి రమణ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న వార్డెన్, తదితరులు

కళాకారులకు ప్రోత్సాహం

వేపాడ: మండలంలోని ముకుందపురంలో కోలాటం నేర్చుకుంటున్న మహిళలను ప్రోత్సహిస్తూ పాటూరు గ్రామానికి చెందిన రమణమూర్తి చిరతలను ఆదివారం అందజేశారు. కోలాటం పూర్తిస్థాయిలో నేర్చుకున్న తర్వాత యూనిఫాం అందజేస్తామని దాత తెలిపారు. దాతకు మహిళలు కృతజ్ఞతలు తెలిపారు.



మహిళలకు చిరతలు అందజేస్తున్న దాత రమణమూర్తి

సస్యరక్షణతో అధిక దిగుబడి

- వరి పంటను ఆశిస్తున్న పొడ,ఆకుముడత తెగుళ్లు

గజపతినగరం సబ్ డివిజన్ పరిధిలో వరి సాధారణ, సాగు విస్తీర్ణం వివరాలు హెక్టార్లలో..		
మండలం	సాధారణ విస్తీర్ణం	సాగు విస్తీర్ణం
గజపతినగరం	3,630	2,800
బొండపల్లి	2,813	2,040
మెంటాడ	2,964	3,250
దత్తిరాజేరు	2,483	2,769

బొండపల్లి: వరి సాగులో రైతులు చేపట్టే సస్యరక్షణ చర్యలపై దిగుబడులు ఆధారపడి ఉంటాయని గజపతినగరం సబ్ డివిజన్ ఏడీఏ కె.మహరాజన్ అన్నారు. వర్షాలు సమయానికి కురవడంతో ఈఏడాది ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి గజపతినగరం సబ్ డివిజన్ పరిధిలోని గజపతినగరం, బొండపల్లి, దత్తిరాజేరు, మెంటాడ మండలాల్లో రైతులు వరి నాట్లు సకాలంలో పూర్తి చేశారు. దత్తిరాజేరు,మెంటాడ మండలాల్లో వరి సాధారణ సాగు విస్తీర్ణం కంటే అధికంగా సాగు చేస్తున్నారు. వరి పంటను ప్రస్తుతం పొడ, ఆకుముడత తదితర తెగుళ్లు ఆశిస్తున్నాయని, నివారణ చర్యలు చేపట్టాలని రైతులకు వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. వరి నాట్లు వేసిన నెల రోజుల వ్యవధి నుంచి 40 రోజుల్లో సాధారణంగా పొడ తెగులుతో పాటు,ఆకు ముడత తెగులు ఆశించే అవకాశం ఉంది.



బొండపల్లి సమీపంలో వరి పంటకు పురుగు మందు పిచికారీ చేస్తున్న రైతు

పొడ తెగులు

నారు నుంచే ఈ తెగులు పంటకు వచ్చే అవకాశం ఉంది.ఈ తెగులు ఆశిస్తే వరిపైరు పూర్తిగా ముదురు గోదుమ రంగులోకి మారిపోయి రెమ్మలు ఎండి పోతాయి నివారణకు 2 మిల్లీ గ్రాముల హెక్సాక్రొనజోల్, లేదా 1 మిల్లీ గ్రాము ప్రాపికొనజోల్ మందును లీటర్ నీటికి కలిపి 15 రోజులు వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేసుకోవాలి.

ఆకు ముడత తెగులు

లద్దె పురుగు వృద్ధి కారణంగా ఈ తెగులు పంటను ఆశిస్తుంది. వరి రెమ్మలు రెండు అంచులను కలిపి గొట్టంలా చేసి మధ్యలో పురుగు ఉంటుంది. రెమ్మలపై తెల్లని చారలు ఏర్పడి క్రమంగా పైరు ఎండి పోతుంది. నివారణకు 1.5 గ్రాముల ఎసిఫేట్ మందును కానీ, కార్టాఫ్ హైడ్రోక్లోరైడ్ 50 డబ్ల్యూపీ మందును 2 గ్రాములను కానీ లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి. అలాగే కార్టాఫ్‌హైడ్రోక్లోరైడ్ 4జీ గుళికలను ఎకరానికి 8 కిలోలను ఇసుకలో కలిపి జల్లడం ద్వారా తెగులును నివారించవచ్చు.

యూరియా వినియోగం తగ్గించాలి

రైతులు విచ్చలవిడిగా యూరియాను వేయకుండా అవసరం మేరకే వేయాలి. ప్రసుత్తం వరి పంటను ఆశిస్తున్న తెగుళ్ల నివారణకు వ్యవసాయ సిబ్బంది సూచనల మేరకు పురుగు మందులను పిచికారీ చేయాలి. రైతులు గుళికలు రూపంలో లభించే యూరియా కాకుండా ద్రవరూపంలో లభిస్తున్న నానోయూరియాను వినియోగిస్తే మేలు.

– కె.మహరాజన్, ఏడీఏ, గజపతినగరం సబ్ డివిజన్

నానో యూరియాతో ప్రయోజనం

రైతులు గుళికలు రూపంలో లభిస్తున్న యూరియా కన్నా ద్రవ రూపంలో లభిస్తున్న నానో యూరియాను వరి పంటపై పిచికారీ చేయడం ద్వారా తక్కువ ఖర్చుతో పంటకు కావాల్సిన నత్రజనిని అందించవచ్చని వ్యవసాయ అధికారుల తెలిపారు. నానో యూరియాను పంటలకు పిచికారీ చేయడం ద్వారా వాతావరణ కాలుష్యాన్ని తగ్గించవచ్చని, భూసారాన్ని కాపాడవచ్చని చెబుతున్నారు. పంట పొట్ట దశలో పొటాష్ ఎరువును 15 నుంచి 20 కిలోలు ఎకరానికి వేయాలని సూచిస్తున్నారు.